రేపే.. రా కదలిరా..

- రాజమహేంద్రవరం రూరల్ కాతేరులో బహిరంగ సభ
- 23 ఎకరాల్లో వేదిక ఏర్పాట్లు ● చంద్రబాబు నాయుడు హాజరు
- ఉదయం 11.45 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సభ
- ఏర్పాట్లకు యనమల, రాజప్ప, గోరంట్ల భూమి పూజ

పంట నష్టానికి ఆ పంట కాలంలోనే పరిహారం..

ఏదీ.. ఎక్కడ?

- సార్వా ముగిసి 40 రోజులు దాటింది
- దాళ్వా వరి సాగు ప్రారంభమై నెలన్నర రోజులు గడిచాయి
- ఇంకా అందని మిచౌంగ్ తుఫాన్ నష్టపరిహారం
- సంక్రాంతి ముందు ఇస్తామని, ఆపై నోరుమెదపని ప్రభుత్వం
- అందుతుందా లేదా అన్న ఆందోళనలో రైతాంగం



మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి పంట (ఫైల్‌ఫొటో)

"పంటనష్టం జరిగిన వెంటనే అంచనా వేసి రోజుల వ్యవధిలో పరిహారం అందిస్తాం. ఏ పంటకాలంలో నష్టం జరిగితే అదే సమయంలో పరిహారం అందిస్తున్న ప్రభుత్వ మిది.." అంటూ సీఎం జగన్ మొదలుకొని మంత్రులు తెగ ఊదరగొట్టేస్తారు. ఆచరణలో మాత్రం ఇందుకు భిన్నం. మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో సార్వా వరి తదితర పంటలకు జరిగిన నష్టానికి పంటకాలం ముగిసి 40 రోజులు గడిచినా, దాళ్వా ప్రారంభమై నెలన్నర దాటుతున్నా ఇంకా పరిహారం మాత్రం అందలేదు. సంక్రాంతి ముందే పరిహారం అందిస్తామని ప్రకటించి ఆపై ప్రభుత్వం నోరు మెదపకపోవడంతో తమకు నష్టపరిహారం అందుతుందా లేదా అన్న ఆందోళనలో రైతులు ఉన్నారు.

తుఫానులో తడిచి మొలకలు వచ్చిన ధాన్యం (ఫైల్)



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో గత ఏడాది డిసెంబరు 4, 5వ తేదీల్లో ఈదురుగాలులతో కురిసిన అతి భారీవర్షాలు జిల్లాలో పంటలను తుడిచి పెట్టేశాయి. సార్వా వరి సాగు చేసిన పొలాల్లో ఉండిపోయిన వరివనలు, కుప్పలు నీటిలో నానిపోగా పలుచోట్ల ధాన్యం రాశులు తడిచిపోవడంతో పాటు కొట్టుకుపోయాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటనేలనంటింది. పలుచోట్ల రోజుల తరబడి వరి నీటిలో నానడంతో ధాన్యం మొలకలు వచ్చింది. కాకినాడ జిల్లాలో సుమారు 70 వేల ఎకరాలకు పైగా వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. వరితో పాటు అపరాలు, పత్తి, మిర్చి, పొగాకు, మొక్కజొన్న, అరటి, బొప్పాయి, మునగ, కాయగూరలు తదితర ఉద్యానపంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒకవిధంగా మిచౌంగ్ తుఫాన్ రైతాంగం వెన్నువిరిచింది. తుఫాన్ వచ్చిన తొమ్మిది రోజులు తర్వాత తీరిగ్గా పంటనష్టం అంచనాలకు ప్రత్యేక బృందాలను నియమించి పరిశీలన జరిపించారు. వారు తూతూమంత్రంగా పరిశీలన జరిపి నష్టాలను నమోదు చేశారు. అప్పటికే వర్షాలకు తడిచిన ధాన్యం రాశులు, దెబ్బతిన్న వరిపంటను రైతులు ఒబ్బిడి చేసుకున్నారు. నేలనంటిన వరిపంటను కోసి కొన్నిచోట్ల మాసూళ్లు పూర్తి చేశారు. ఇటువంటి వాటిని నమోదు చేసేందుకు పలుచోట్ల బృందాలు అంగీకరించకపోవడం, వరికుప్పలు, ధాన్యం రాశులు వారంరోజులకు పైగా నీటిలో నానినా నిబంధనల పేరుతో వాటిని నమోదు చేయకపోవడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. పంటలకు జరిగిన నష్టం నమోదు సక్రమంగా జరగలేదని కొద్దిరోజుల కిందట జరిగిన గొల్లప్రోలు, పిఠాపురం మండల పరిషత్ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పంటకు తీవ్ర నష్టం జరిగిన చోట కూడా నమోదు చేయకపోతే ఎలా అని నిలదీశారు.

ఎట్టకేలకు నమోదు ప్రక్రియ పూర్తి

తుఫాన్ వచ్చిన నెలరోజుల తర్వాత నమోదు ప్రక్రియ పూర్తిచేశారు. కాకినాడ జిల్లాలో 31,045 ఎకరాల్లో వరిపంటకు మాత్రమే నష్టం జరిగిందని అధికారులు నిర్ధారించారు. 26,905 మంది రైతులకు రూ.2137 కోట్లు పరిహారంగా చెల్లించాలని ప్రభుత్వానికి తుది నివేదిక సమర్పించారు. అదేవిధంగా 1079 ఎకరాల్లో అపరాలు, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు, సుమారు 3,950 ఎకరాల్లో ఉద్యానవన పంటలకు నష్టం జరిగిందని ప్రభుత్వానికి నివేదించారు. జరిగిన నష్టంలో కనీసం 50 శాతం కూడా నివేదికల్లో నమోదు కాకపోవడంతో ఎక్కడికక్కడ నిబంధనల పేరుతో వరి సహా ఇతర పంటలకు జరిగిన నష్టాలను పూర్తిస్థాయిలో నమోదు చేయలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో తుఫాన్ల సమయాల్లో వేసిన ప్రాథమిక అంచనాలకంటే తుది అంచనాల నమోదు అధికంగా ఉండడం జరిగేదని, ఈసారి మాత్రం జరిగిన నష్టంలో కోత పెట్టారని, ఇది చాలా అన్యాయమని అప్పట్లోనే రైతులు ఆవేదన వ్యక్తంచేశారు.

పరిహారం మాట మరిచారు...

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏ పంటకు నష్టం జరిగితే ఆ పంట కాలంలోనే పరిహారం ఇస్తున్నామని, గతంలో ఏ ప్రభుత్వాలు ఇలా చేయలేదంటూ సీఎం జగన్ గొప్పలు చెప్పేవారు. ఇప్పుడు సార్వా సీజన్‌లో పంట నష్టం జరిగింది. ఆ పంట కాలం ముగిసి 40 రోజులు దాటింది. అయినా పరిహారం ఎప్పుడు అందిస్తారో అన్న విషయంలో గందరగోళం నెలకొంది. సంక్రాంతిలోగానే నష్టపరిహారం అందిస్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటించినా అది కార్యరూపం దాల్చలేదు. మరోవైపు మిచౌంగ్ తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు దాళ్వా సాగుకు అవసరమైన పెట్టుబడులు లేక అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారు. సార్వా పంటకు జరిగిన నష్టానికి పరిహారం వస్తే కొంత వెసులుబాటు ఉంటుందని భావించిన వారికి ప్రభుత్వం షాక్‌ను ఇచ్చింది. దాళ్వా సాగు ప్రారంభమై నెలన్నర దాటినా పరిహారం అందకపోవడం, ప్రభుత్వం నుంచి పరిహారం ఎప్పుడు అందుతుందో స్పష్టత లేకపోవడంతో అసలు వస్తుందా రాదా అన్న సందేహాలు నెలకొన్నాయి. పంటకాలం ముగిసినా పరిహారం అందించకపోవడం, త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు ఉన్నాయన్న సమాచారం రైతుల ఆందోళనను మరింత అధికం చేస్తున్నది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొండబాబు

వక్రమార్గాల్లో కార్పొరేషన్ సొమ్ము దోచుకుంటున్న ద్వారంపూడి

- కాకినాడలో టీడీఆర్ బాండ్ల పేరుతో రూ.251 కోట్ల మరో కుంభకోణం
- నిగ్గు తేల్చాలని జిల్లా కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే కొండబాబు ఫిర్యాదు

కాకినాడ సిటీ, జనవరి 27: కాకినాడ నగర ప్రజలు పన్నుల రూపంలో చెల్లిస్తున్న కార్పొరేషన్ సొమ్మును వక్రమార్గాల్లో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి దోచుకుంటున్నాడని, ముఖ్యంగా టీడీఆర్ బాండ్ల పేరుతో రూ.251 కోట్ల మరో కుంభకోణానికి తెరలేపి దోపిడీ శేఖర్ దోచుకున్నాడని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆరోపించారు. శనివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక దుమ్ములపేట సమీప ప్రాంతంలో సర్వే నంబర్ 1986/3బి2, టీఎస్ నంబర్ 1989/1ఏ,4ఏలో గల 4 ఎకరాల 67 సెంట్ల ప్రైవేటు భూమికి కాకినాడ నగరపాలక సంస్థ నుంచి గజం స్థలం రూ.28 వేల మార్కెట్ విలువ చొప్పున 1:4 నిష్పత్తిలో సుమారు రూ.251 కోట్ల విలువ చేసే టీడీఆర్ బాండ్లను మంజూరు చేయించి ఎమ్మెల్యే దోచుకున్నాడన్నారు. ఇదే ప్రాంతం అనుకుని నగరపాలక సంస్థ పరిధిలో అనేక ప్రభుత్వ భూములు, పోర్టు భూములు ఉండగా, ద్వారంపూడి తనకు లబ్ధి చేకూరేలా ప్రైవేటు భూమిని ఎంపిక చేసి వాటికి గుట్టుచప్పుడు కాకుండా టీడీఆర్ బాండ్లు మంజూరు చేయించాడన్నారు. వక్రమార్గాల్లో కార్పొరేషన్ సొమ్ము దోచుకుంటున్న ద్వారంపూడికి సహకరించలేక గత కమిషనర్లు బదిలీలపై వెళ్లిపోవడం జరిగిందన్నారు. ద్వారంపూడి దోపిడీకి ప్రస్తుత నగర కమిషనర్ సహకరిస్తూ కార్పొరేషన్ సొమ్మును దుర్వినియోగం చేస్తూ కార్పొరేషన్ ఖజానాను గుల్ల చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి గతంలో ఈవిధంగానే కార్పొరేషన్ పరిధిలో గల సురేష్‌నగర్ ప్రభుత్వ భూమిపై టీడీఆర్ బాండ్ల దోపిడీకి అప్పటి అధికారులు బలయ్యారన్నారు. కాకినాడ కార్పొరేషన్‌కు స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా కలెక్టర్ ఉన్నప్పటికీ కార్పొరేషన్ సొమ్మును ఈ విధంగా దోచుకుంటున్నా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం వల్ల ఇటువంటివి పునరావృతం అవుతున్నాయన్నారు. కార్పొరేషన్ సొమ్ము దుర్వినియోగంపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి టీడీఆర్ బాండ్లను రద్దు చేసి ప్రభుత్వ ఖజానాను కాపాడాలన్నారు. దీనిపై మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ కమిషనర్ అండ్ డైరెక్టర్‌కు, జిల్లా కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే కొండబాబు ఫిర్యాదు చేశారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు వలివెల రవి, తుమ్మల రమేష్, గదుల సాయిబాబు, సీకోటి అప్పలకొండ, వొమ్మి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



అధికారులు సీజ్ చేసిన టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లు



రామేశంమెట్ట నుంచి గ్రావెల్ తరలిస్తున్న 13 టిప్పర్ లారీలు సీజ్

- రూ.1.30 లక్షలు పెనాల్టీ విధించి చేతులు దులిపేసుకున్న అధికారులు
- గుట్టుగా తనిఖీలు
- మీడియాకు సమాచారమివ్వడానికి నిరాకరించిన మైన్స్ అధికారులు
- ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు

పెద్దాపురం, జనవరి 27: రామేశంమెట్ట నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న 13 టిప్పర్లను, రెండు ఎక్స్‌కవేటర్లను రెవెన్యూ, మైన్స్ అధికారులు సంయుక్తంగా దాడులు చేపట్టి శనివారం సీజ్ చేశారు. ఇటీవల రామేశంమెట్టపై జరుగుతున్న అక్రమ తవ్వకాలపై 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. అక్రమ గ్రావెల్ తవ్వకాలపై వరుస కథనాలు ప్రచురితంకావడంతో ఈ దాడులు చేపట్టినట్టు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని మీడియాకు తెలియజేయకుండా అధికారులు రహస్యంగా ఉంచడంతో పలు అనుమానాలు కలుగుతున్నాయి. పట్టుబడ్డ లారీలను వదిలివేయాలని అధికారులకు కొంతమంది వైసీపీ నాయకుల నుంచి ఒత్తిడులు వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో పూర్తిస్థాయిలో సమాచారం చెప్పడానికి అధికారుల నిరాకరించారు. పట్టుబడ్డ లారీకు రూ.1.30 లక్షలు అపరాధ రుసుమును విధించి అధికారులు చేతులు దులిపేసుకున్నారని సమాచారం. ఈ దాడుల్లో తహశీల్దార్ వజ్రపు జితేంద్ర, ఆర్ఐ వెంకటేష్, మైన్స్ అధికారులు పాల్గొన్నారు.

'అర్హత లేని ఆర్ఎంపీలు వైద్యం చేస్తే క్రిమినల్ చర్యలు తప్పవు'

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 27: జిల్లాలో ఎటువంటి అర్హత లేకుండా ఆర్ఎంపీలు విచ్చలవిడిగా వైద్యం అందిస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయని, ఎక్కడైనా అనధికారికంగా క్లినిక్‌లు నిర్వహించినా, వైద్యం చేసినా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. అర్హతలేని వైద్యులతో ఎటువంటి వైద్య సేవలు పొందరాదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఎవరైనా ఆర్ఎంపీలు అర్హతలు లేకుండా డాక్టర్ అని బోర్డులు పెట్టినా, వైద్యం చేసినా వెంటనే కాకినాడలోని డీఎంహెచ్‌వోకు స్వయంగా, రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



నగరపేటలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేటలో వైసీపీకి భారీ షాక్

నగరపేట, రాజపూడిల నుంచి జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలోకి చేరికలు

జగ్గంపేటరూరల్, జనవరి27: జగ్గంపేట మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. గుర్రప్పాలెం పంచాయతీ పరిధిలోని నగరపేట, రాజపూడి గ్రామాల నుంచి భారీగా వైసీపీని వీడి మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలోకి చేరారు. వీరందరికీ నెహ్రూ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పరిపాలన సాగుతోందన్నారు. సీఎం జగన్ ప్రజలకు సంక్షేమం పేరుతో ఎరవేసి టాక్స్‌లు, పన్నుల రూపంలో ప్రజల నడ్డి విరుస్తున్నాడన్నారు. ప్రజలకు క్రమేపీ అర్థమవుతోందని, అందుకే జగన్ సభలకు జనం కరువవుతున్నారన్నారు. చంద్రబాబు పరిపాలనలో సామాన్యులు సుఖంగా జీవించగలిగే వారిని నేడు వేలకు వేలు పెట్టినా జీవనం సాగని పరిస్థితికి తీసుకువచ్చారని ఎద్దేవా చేశారు. త్వరలో జరిగే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జనసేన, టీడీపీ ప్రభుత్వాన్ని నూటికి నూరుశాతం ఏర్పాటుచేస్తామని అన్నారు. అలాగే టీడీపీలోకి చేరిన వారిలో వైసీపీకి చెందిన నక్క పెద్ద వెంకటేష్, పొంద్రు లోవరాజు, పొంద్రు రాధాకృష్ణ, అప్పన్నతోపాటు 50 కుటుంబాలవారు, అలాగే రాజపూడి నుంచి ముమ్మన శివ, ముచ్చుకర్ల రాంబాబు, కొల్లు శ్రీను, పప్పల వరహాలరావు, జామి వెంకట్రావు, నానిపల్లి రమణ, ముచ్చుకర్ల సత్తిబాబు, సర్వసిద్ధ రామకృష్ణ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, రేఖ బులిరాజు, కొత్త కొండబాబు, పాఠంశెట్టి రవి, ఒట్లు కృష్ణ, పడాల విష్ణు, అడపా తాతాజీ తదితరులు పాల్గొన్నారు.




కాకినాడలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్ విజయవంతం చేయాలి

కాకినాడ నగరంలో కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ


కాకినాడ సిటీ, జనవరి 27: ఫిబ్రవరి 16న దేశవ్యాప్త గ్రామీణ బంద్ విజయవంతం చేయాలని ఆల్ ఇండియా కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రైతు సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు శనివారం కాకినాడలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం తీసుకు రావాలని, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి రోజువారీ వేతనం రూ.600 చెల్లించాలని వారు నినాదాలు చేశారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా పంట రుణాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అధిక ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో 16న తలపెట్టిన దేశవ్యాప్త గ్రామీణ బంద్‌లో స్వచ్ఛందంగా రైతులు, కార్మికులందరూ పాల్గొనడం ద్వారా మోదీ కార్పొరేట్ అనుకూల రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె వెంకటేశ్వర్లు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి రాజబాబు, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు గదుల సాయిబాబు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు తోటారి రాజు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పింజుమళ్ల చిట్టిబాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడారు. ఈ బైక్ ర్యాలీ భానుగుడి సెంటర్ నుంచి మెయిన్‌రోడ్, దేవాలయం వీధి మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది.



జాబితాలో మరణించిన వారు ఉన్నా తొలగని దృశ్యం

తవ్వే కొద్దీ తప్పులు

తొలగని డబుల్ ఓట్లు, మరణాలు.. తప్పుల తడకగా ఓట్ల జాబితా



తునిరూరల్, జనవరి 27: ఇప్పటికే విడుదలైన ఓటర్ల తుది జాబితాలతో అధికారుల తప్పిదాలతో తప్పులు దర్శనమిస్తున్నాయి. బీఎల్‌వోలు గతంలో ఇంటింటా సర్వే చేపట్టి మృతి చెందిన ఓటర్ల మార్పులు, చేర్పులు, డబుల్ ఓట్ల తొలగింపుకు ఓటర్ల దరఖాస్తు తీసుకున్నారు. వీటిలో కొన్నింటిని తొలగించినప్పటికీ ఇంకా కొన్ని అలాగే ఉన్నాయి. తుని నియోజకవర్గంలో తుని, తొండంగి, కోటనందూరు మండలాల్లో 2,20,877 ఓట్లను గుర్తించి తుది జాబితాలో పొందుపరిచారు. దీంతో పురుషులు 1,09,052 మంది ఉండగా మహిళలు 1,11,800 మంది ఉన్నారు. తుని నియోజకవర్గం డి.పోలవరంలో పీఎస్ 46 జాబితాను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా వంగల జ్యోతి వరుస సంఖ్య 1వ నెంబరు, వరుస సంఖ్యలో 205 నెంబర్లలో డబుల్ ఓటు కలిగి ఉంది. మాసా మరిడియ్య వరుస సంఖ్యలో 10, వరుస సంఖ్యలో 618లో రెండుసార్లు ఓట్లు కనిపిస్తోంది. వరుస సంఖ్య 416 చెందిన వ్యక్తి ఫోటో మార్పు దరఖాస్తు కోరిన పాత ఫొటోనే కనిపిస్తోంది. వరుస సంఖ్యలో 588,589 మరణించిన వారి ఓట్లు అలాగే ఉండిపోయాయి. వరుస సంఖ్య 206 ఓటరు డోర్ నెంబరు 001గా తప్పుగా నమోదైంది. కొందరివి ఫొటోలు తలకిందుగా గుర్తుపట్టని విధంగా దర్శనమిస్తున్నాయి. కేశవశెట్టి నాగు అనే యువకుడి ఓటు పీఎస్ 46లో వరుస సంఖ్యలో 1138, అదే గ్రామంలో పీఎస్ 47లో వరుస సంఖ్యలో 172లో రెండో ఓటు దర్శనమిచ్చింది.



సామర్లకోట పరిధిలోని ఎత్తిపోతల పథకం

ఆయకట్టుకు సాగునీరందేనా..

- అడుగంటుతున్న గోదావరి జలాలు.. ఎత్తిపోతలకు గండం

సామర్లకోట, జనవరి 27: దాళ్వా వరిసాగులో భాగంగా గోదావరి కాలువ పరీవాహక ప్రాంతాలైన సామర్లకోట మండలంలోని పెద బ్రహ్మదేవం, ఇళ్ళపల్లి, జి.మేడపాడు, వేట్లపాలెం, పెద్దాడ, కాపవరం ఎత్తిపోతల పథకాల ఆయకట్టు కింద సమృద్ధిగా సాగునీరు అందుతుందా, లేదా అనే సందిగ్ధ పరిస్థితి రైతుల్లో నెలకొంది. సాధారణంగా ప్రభుత్వ సాగునీటిపారుదల శాఖ ఆదేశాల మేరకు ఎత్తిపోతల పథకాల కింద 5,100 ఎకరాల ఖరీఫ్ సాగుకు మాత్రమే అనుమతులు ఉంటాయి. సామర్లకోట మండల పరిధిలో ఈ ఎత్తిపోతల పథకాల కింద సుమారు 6 వేల ఎకరాలు ప్రత్యక్షంగా, మరో 2 వేల ఎకరాలు పరోక్షంగానూ రైతులు ఏటా సాగు చేస్తుంటారు. ఇందుకు సంబంధించి రైతుల నుంచి అనధికార వసూళ్లు సైతం సంఘాల ప్రతినిధులు ప్రతీ ఏటా వసూలు చేస్తుంటారు. ఇక దాళ్వా సాగుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులుండవు. ఇందుకు అనుగుణంగా విద్యుత్ శాఖ నుంచి సైతం ఎత్తిపోతల పథకాలకు చెందిన విద్యుత్ సరఫరాను నిలిపివేసి ఆయా పథకాల నిర్వాహకులకు సమాచారం అందిస్తారు. ఇప్పటికే ఎత్తిపోతల పథకాలకు చెందిన విద్యుత్ బకాయిలు రూ.18.80 కోట్ల మేర పేరుకుపోవడంతో బకాయిలు చెల్లించాల్సిందేనని విద్యుత్ అధికారులు ఇప్పటికే నోటీసులు జారీచేశారు. ప్రభుత్వం విద్యుత్ బకాయిలు గతంలో నేరుగా జమ చేసేది. అయితే గత నాలుగున్నరేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన దాఖలాలే లేవు. అయితే ఇప్పటివరకూ ఈ ఆయకట్టు రైతాంగానికి ఎటువంటి సమాచారం లేకపోవడంతో దాళ్వా సాగు చేయాలా, వద్దా అనే సందిగ్ధ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దాళ్వా సాగుకు పూర్తి స్థాయిలో సాగునీరందించేవిధంగా గోదావరి ఎగువ ప్రాంతాల్లో నీటి నిల్వలు లేవని, దీనిని దృష్టిలో ఉంచుకుని మాత్రమే రైతులు దాళ్వాసాగుకు సమాయత్తం కావాలని ప్రాథమికంగా హెచ్చరించారు. కాగా గోదావరి కాలువ జలాల ఆధారంగా విడుదల చేస్తున్న గోదావరి జలాలను ఎగువ ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలు అనధికారికంగా వినియోగించడంతో దిగువ ప్రాంతాలైన పీబీసీ కెనాల్‌కు నీటి సరఫరా గణనీయంగా తగ్గి అనుమతులు ఉన్నప్పటికీ అనధికార నీటి వినియోగం పెరగడం రైతుల మధ్య వివాదంగా మారే పరిస్థితులు నెలకొన్నాయి. ఆయా పరిశ్రమలకు సైతం సామర్లకోట నుంచి గోదావరి కాలువ ద్వారా సరఫరా అయ్యే గోదావరి జలాలే ఆధారం. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి ఎత్తిపోతల పథకాల ఆయకట్టుకు సాగునీటి అనుమతులు విషయంలో స్పష్టత వెల్లడించాల్సి ఉంది.

తాగునీటి పథకాలకు గోదావరి జలాలే కీలకం

సామర్లకోట, పెద్దాపురం, కాకినాడ పట్టణాల ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే వేసవి జలాశయం, సాంబమూర్తి రిజర్వాయర్‌లకు గోదావరి జలాలే కీలకం. అయితే ఎత్తిపోతల పథకాలకు ముందస్తుగా కాలువలో జలాలను మళ్లిస్తే దిగువన ఉన్న తాగునీటి జలాశయాలకు తాగునీటి నిల్వలకు మాత్రమే కాకుండా పీబీసీ కెనాల్ ఆయకట్టులో సాగునీటికి సైతం ఇబ్బందులు ఏర్పడే ప్రమాదముంది. దీనిపై స్పష్టమైన సమాచారం ఇవ్వాల్సింది ఇరిగేషన్ అధికారులే. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇరిగేషన్ అధికారులు ఎటూ తేల్చకపోతే అంతిమంగా నష్టపోయేది తాగునీటి కోసం మూడు పట్టణాల ప్రజలు, సామర్లకోట దిగువన దాళ్వా సాగుచేస్తున్న ఆయకట్టు రైతాంగం మాత్రమేనని తెలుస్తోంది.



రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

నాటక పోటీల విజేతలకు బహుమతి ప్రదానం

పెద్దాపురం, జనవరి 27: గత మూడు రోజులుగా పెద్దాపురం మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు కె.శాంతారావు, గోగులపాటి రాంబాబు, రాధాస్వామి వ్యవహరించారు. ఈ పోటీల్లో ఏడు నాటికలు ప్రదర్శించగా ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ వారి 'ఇంద్రప్రస్థం' నాటిక గెలుపొందింది. అలాగే ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా మిత్రా ఆర్ట్స్ వారి 'లక్ష్మణరేఖ దాటితే' నాటిక గెలుపొందింది. తృతీయ ఉత్తమ ప్రదర్శనగా 'స్వప్నం రాల్చిన అమృతం' గెలుపొందింది. కార్యక్రమంలో గొండేసి రాజా, ఐందన బ్రహ్మానందం, పాలని సత్తిబాబు, మంతెన సత్తిబాబు, కేదారి నాగు, మాగాపు నాగు, వెన్నా పండు, రవీంద్ర, పాపేశ్వరరావు పాల్గొన్నారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం,జనవరి27: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునుంచే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,70,700, అన్నదాన విరాళాలు రూ.1,25,706 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.6,430, వెరసి రూ.3,02,286 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో పులి నారాయణమూర్తి చెప్పారు. పది వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారన్నారు.

తెలుగుదేశం పిలుస్తోంది

రేపే.. రా కదలి రా..



కాతేరులో సభ ఏర్పాట్లకు భూమి పూజ చేసిన యనమల, రాజప్ప,గోరంట్ల, రవి, బత్తుల

- రాజమహేంద్రవరం రూరల్ కాతేరులో బహిరంగ సభ
- 23 ఎకరాల్లో వేదిక ఏర్పాట్లు
- చంద్రబాబు నాయుడు హాజరు
- ఏర్పాట్లకు యనమల, రాజప్ప, గోరంట్ల భూమి పూజ

రాజమహేంద్రవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని కాతేరులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఈనెల 29న తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఈ సభ ఏర్పాట్లను శనివారం ఉదయం 9.30 గంటలకు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప, జోన్- 2 కోఆర్డినేటర్ రవి, జనసేన రాజానగరం ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నేతలు యర్రా వేణు గోపాల్‌రాయుడు, కోనేరు నవీన్ తదితరులు భూమి పూజ చేశారు. వేద మంత్రాల మధ్య రాట పాతి పనులు ప్రారంభించారు. అనంతరం ప్రియాంక గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా జరగనున్న ఈ సభకు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల నుంచి అత్యధికంగా క్యాడర్ తరలి రావాలన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ 23 ఎకరాల్లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హెలిప్యాడ్, పార్కింగ్ ఏర్పాట్లు, భోజన ఏర్పాట్లు కూడా చేస్తున్నట్టు చెప్పారు. చంద్రబాబు సభకు పార్టీ కార్యకర్తలు, నేతలు, జనసైనికులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపు ఇచ్చారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ రూరల్ నుంచి అన్నివర్గాల ప్రజలు వచ్చేలా ప్రచారం చేయాలన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో ఈసభ జరగనున్నదని, ఏర్పాట్లు చూసి వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, అంగర రామ్మోహనరావు, చిల్లా జగదీశ్వరి, పెచ్చెట్టి చంద్రమౌళి, డొక్కా నాథ్‌బాబు, వాసిరెడ్డి రాంబాబు, చెల్లుబోయిన శ్రీనివాస్, మజ్జి పద్మావతి, గంగిన హనుమంతరావు, మార్ని వాసుదేవ్, పందూరి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



స్థానిక ప్రియాంక గార్డెన్స్‌లో జరిగిన రూరల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

రేపు చంద్రబాబు పర్యటన ఇలా...

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఈనెల 29న టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాజమహేంద్రవరం రానున్నారు. రూరల్ నియోజకవర్గం పరిధిలోని కాతేరులో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా.. సభకు ఆయన హాజరవుతున్నారు. దీనికోసం ఆయన 29న నెల్లూరు జిల్లాలో పర్యటన ముగించుకుని ఉదయం 11.15గంటలకు ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన 11.25 గంటలకు బయలుదేరి కాతేరులోని మల్లు లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు వస్తారు. 11.45 గంటలనుంచి ఒంటిగంట వరకూ బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం 1.50కు బయలుదేరి కాతేరులో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని వడ్లమూడి వెళతారు.

అపరాధ రుసుముతో.. ఇంటర్ పరీక్షల ఫీజుకు రేపే చివరి తేదీ

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలవల్ల ఇప్పటి వరకూ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు-2024 నిమిత్తం ఫీజు చెల్లించని వారు తత్కాల్ స్కీం కింద అపరాధ రుసుం రూ.3వేలతో ఈనెల 29 (సోమవారం) సాయంత్రం 5గంటలలోపు చెల్లించాలని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్‌ఎస్‌వీఎల్ నరసింహం సూచించారు. జనరల్, ఒకేషనల్ విభాగాల్లోని రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల బాధ్యులు చొరవ చూపాలన్నారు. విద్యార్థులు చెల్లించిన ఫీజును ఆన్‌లైన్ పేమెంటు ద్వారా బోర్డుకు ప్రిన్సిపాల్స్ జమచేయవచ్చన్నారు.

రేపు వికాసలో జాబ్ మేళా : పీడీ

కాకినాడసిటీ, జనవరి 27: ఈనెల 29న కాకినాడలోని వికాస కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో మెరైన్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఎస్ఆర్ అకౌంటెంట్, ఈవో డీల్స్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఇండో ఎంఐఎం కంపెనీలో టెక్నీషియన్, సీఐఈ ఆటోమోటివ్ ఇండియా లిమిటెడ్‌లో టెక్నీషియన్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్) ఉద్యోగాలతో పాటు డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 30 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్: 7799376393లో సంప్రదించాలన్నారు.

ఫిబ్రవరి 3కు మారిన 'ఉమ్మడి' జిల్లా పరిషత్ సమావేశం

కాకినాడ సిటీ, జనవరి 27: ఈనెల 30వ తేదీన జరగాల్సిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం అనివార్య కారణాలవల్ల ఫిబ్రవరి 3వ తేదీకి మార్పు చేసినట్టు జడ్పీ సీఈవో ఏ.రమణారెడ్డి తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 నుంచి జడ్పీ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో జడ్పీచైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధశాఖల ద్వారా జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ప్రగతి ప్రధాన అజెండాగా సమీక్షిస్తారన్నారు. సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల పూర్తి సమాచారంతో 3వ తేదీ ఉదయం 10.30కు హాజరుకావాలని సీఈవో ఒక ప్రకటనలో కోరారు.

'అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్ మేళం' అలరిస్తోంది

- హీరో సుహాస్, హీరోయిన్ శివాని



మాట్లాడుతున్న హీరో సుహాస్, హీరోయిన్ శివాని

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 27: వచ్చేనెల 2న విడుదల కాబోతున్న అంబాజీపేట మేరేజ్ బ్యాండ్ మేళం సినిమా ప్రేక్షకులందరినీ అలరిస్తోందని ఆ చిత్రం హీరో సుహాస్, హీరోయిన్ శివాని తెలిపారు. ఈ సినిమా ప్రమోషన్ వర్క్‌లో భాగంగా చిత్ర బృందం శనివారం రాజమహేంద్రవరం విచ్చేసింది. ఈ సందర్భంగా స్థానిక పెల్హాన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో సుహాస్ మాట్లాడారు. ఈ సినిమా విడుదలయ్యాక ప్రేక్షకుల నుంచి వచ్చే ఆనందం కోసం ఎదురుచూస్తున్నామన్నారు. ప్రమోషన్ వర్క్‌లో భాగంగా విశాఖ, కాకినాడ మీదుగా రాజమహేంద్రవరం వచ్చామన్నారు. కవల పిల్లలైన అక్కా తమ్ముడు పుట్టిన రోజు సందర్భంగా జరిగే సంఘటన ఆధారంగా వాళ్ల జీవితాలు ఎలా మలుపుతిప్పాయన్నది చిత్ర ఇతివృత్తమన్నారు.

కాకినాడలో ఫిబ్రవరి 26న అప్పా రాష్ట్ర మహాసభలు

గొల్లప్రోలు రూరల్, జనవరి 27: ఆంధ్రప్రదేశ్ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ మూడవ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 26వ తేదీన కాకినాడలో నిర్వహిస్తున్నట్లు అప్పా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిల్లా చంద్రం తెలిపారు. గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో అసోసియేషన్ విశాఖ, అనకాపల్లి, కాకినాడ, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా అప్పా రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రం మాట్లాడుతూ నూతన విద్యావిధానం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలతో పేదలకు ప్రభుత్వ విద్య దూరమవుతున్నదని తెలిపారు. గ్రామాల్లో పాఠశాలలను విలీనం పేరుతో ఇతర ప్రాంతాలకు తరలిస్తే పేదల పిల్లలు ఎలా చదువుకుంటారని ఆయన ప్రశ్నించారు. వసతిగృహాల్లో మెనూ సక్రమంగా అమలు కావడంలేదని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, ఏళ్ల తరబడి పోస్టులు భర్తీ చేయడంలేదని తెలిపారు. ప్రతి ఏటా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా జిల్లాలకు చెందిన అప్పా ప్రతినిధులు పాల్గొన్నారు.



ఏపీ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం

- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.38.4 లక్షలు



నటి వర్షిణికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జనవరి 27: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ ఐశ్వర్యలక్ష్మిహోమం, బాలభోగం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాలనుంచి భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ షర్మిలారెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.38.4 లక్షలు లభించినట్లు ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. అలాగే జబర్దస్త్‌తో పాటు వివిధ బుల్లితెర షోలలో నటిస్తున్న యాంకర్ వర్షిణి శనివారం కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. స్వామివారి చిత్రపటం అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గోదావరి రొయ్య సీడ్ కోసం

మత్స్యకారులపై ఒత్తిడి

- రెండు వర్గాలతో హైపవర్ అఫీషియల్స్ సమావేశం
- మత్స్యకారులతో మంత్రి వేణు, కలెక్టర్, కోనసీమ అధికారుల చర్చలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

రాజమహేంద్రవరం, జనవరి27(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం బ్యారేజి దిగువ ప్రాంతంలో బ్యారేజి నుంచి నీటి ప్రవాహం ఉన్న సమయాల్లో మత్స్యకారులు వేటాడిన రొయ్యసీడ్‌ను మత్స్యశాఖకు ఇవ్వాలని, కానీ అందరూ ఇవ్వడంలేదని కారణంతో మంత్రి చెల్లుబోయిన వేణు, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లా అధికారులు ధవళేశ్వరం, బొబ్బర్లంక మత్స్యకారులతో చర్చించారు. పూర్వం నుంచి ధవళేశ్వరం బ్యారేజి దిగువన రొయ్యసీడ్ ను ధవళేశ్వరం, బొబ్బర్లంక మత్స్యకారులు వేటాడుతుంటారు. ధవళేశ్వరం మత్స్యకార సొసైటీ 1 నుంచి 70 బ్యారేజీ గేట్ల వరకూ వేటాడుకోవచ్చు. వీరు లీజుకు తీసుకున్నారు. బొబ్బర్లంక సొసైటీ వారు లీజుకు తీసుకోకుండానే చాలా కాలం నుంచి రొయ్య పిల్లల వేట సాగిస్తున్నారు. ధవళేశ్వరం సొసైటీ లీజుకు తీసుకున్న పరిధిలోకి వారు వచ్చేసి వేటాడుతున్నట్టు ఆరోపణ. అది ఒక సమస్య కాగా, ఇక్కడ అసలు సమస్య ఒకటి ఉంది. ప్రతిఏటా అఖండ గోదావరిలో రొయ్య పిల్లలను అధికారులు వదులుతుంటారు. అవి పెద్దవి అయ్యాక, మత్స్యకార్లకు ఉపాధి ఉంటుందనేది వారి లక్ష్యంగా చెబుతుంటారు. కానీ దీనికోసం బ్యారేజి దిగువ రొయ్య పిల్లలను వేటాడేవారు మత్స్యశాఖకు ఉచితంగా రొయ్యపిల్లలు ఇవ్వాలి. ధవళేశ్వరం సొసైటీ వారు ప్రతిఏటా 5 లక్షల పిల్లలను ఇస్తుంటారు. కానీ బొబ్బర్లంక సొసైటీ వారు ఇవ్వడంలేదు. దీనిపై ప్రధానంగా సమావేశం నిర్వహించారు. తాము తమ పెద్దలనాటి నుంచి వేటాడుతున్నామని, ఎప్పుడూ లీజుకు తీసుకోలేదు. రొయ్య పిల్లలూ ఇవ్వలేదని బొబ్బర్లంక సొసైటీ మత్స్యకారులు వాదించారు. కానీ దీనిపై అధికారులు జోక్యం చేసుకుని గతంలో లాగా ఉచితంగా వేటకు వీలులేదని, మారిన నిబంధనల మేరకు లీజుకు తీసుకుని రొయ్య పిల్లలను ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. పైగా ఎంత సీడ్ వేటాడుతున్నారో కూడా చెప్పాలన్నారు. ఈ పిల్లలను తిరిగి గోదావరిలో వదలడంవల్ల అవి ఎదిగిన తర్వాత ఎగువ దిగువ మత్స్యకారులకు ఉపాధికి ఉపయోగపడతాయని చెప్పారు. మంత్రి వేణు మాట్లాడుతూ ధవళేశ్వరం, బొబ్బర్లంకల్లో మత్స్యకారులందరికీ ఉపాధి కలిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ డా. కె.మాధవీలత మాట్లాడుతూ ధవళేశ్వరం సొసైటీ మాదిరిగా బొబ్బర్లంక సొసైటీ కూడా లీజుకు దరఖాస్తు చేసుకోవాలని, అది పూర్తయిన తర్వాత ఏరియాను విభజిస్తారని, ఎవరి పరిధిలో వారు వేటాడుకో వచ్చని చెప్పారు. మత్స్యశాఖ జేడీ కృష్ణారావు మాట్లాడుతూ అందరూ కచ్చితంగా రొయ్యసీడ్ ఇవ్వాల్సిందే నన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ పి.జగదీష్, జేసీ ఎన్.తేజ్‌భరత్, అంబేద్కర్ కోనసీమజిల్లా జేసీ శ్రీవాస్ నూపర్ అజయ్, ఏఎస్పీ ఖాదర్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

- ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్ కుమార్ మిశ్రా
- అత్యాశతో చిక్కుల్లో పడొద్దు : సీఐడీ ఏఎస్పీ పాపారావు



సదస్సులో మాట్లాడుతున్న సీఐడీ అడిషనల్ ఎస్పీ పాపారావు

రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడుతుందని ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. బీజీఎస్‌సీఎస్ సౌజన్యంతో రాజమహేంద్రవరం ప్రాంతీయ సీఐడీ అధికారి ఆధ్వర్యంలో సైబర్ నేరాల తీరు, వాటిని అరికట్టే విధానాలపై పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలపై రూపొందించిన బ్రోచర్‌ని ఆవిష్కరించి మాట్లాడారు. అంతగా చదువుకోని వాళ్లు ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడుతుంటే బాగా చదువుకున్న వారు సైతం వాటిని ఎదుర్కోవడంలో విఫలం కావడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఇటీవల నమోదవుతున్న కేసుల్లో ఎక్కువగా అలాంటివే ఉంటున్నాయన్నారు. దీనికి సాంకేతికతపై అవగాహన లేకపోవడమే అసలు కారణమన్నారు. సాంకేతిక పరికరాలను వినియోగించే క్రమంలో ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోసం జరిగిందని గ్రహించిన వెంటనే టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి గానీ, సైబర్ క్రైం పోలీసులకుగానీ ఫిర్యాదు చేయాలన్నారు. సీఐడీ అదనపు ఎస్పీ పాపారావు మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులను అత్యాశతో క్లిక్ చేస్తూ చిక్కుల్లో పడుతున్నారని తెలిపారు. మోసం చేయడానికి సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో ఆశ కల్పిస్తుంటారని గ్రహించాలన్నారు. బ్యాంక్ అకౌంట్, వ్యక్తిగత, ఆధార్, పాన్, ఏటీఎం నెంబర్, పిన్, ఓటీపీ వివరాలను అపరిచితులతో పంచుకోకూడదన్నారు. హైదరాబాద్‌లోని ఇన్‌ఫర్మేషన్ అండ్ సైబర్ సెక్యూరిటీ రీసెర్చ్ మాజీ సీఐఎస్‌వో బీ.శ్రీనివాస్ ఇంటర్నెట్, సెల్‌ఫోన్ల వినియోగంలో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఓటీపీలు చెప్పమనడం, మోసపూరిత లింకులు, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్లు ఇబ్బందులకు గురిచేస్తాయన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం ఉంచకపోవడమే మేలన్నారు. టోల్‌ఫ్రీ నెం.1930 ఆవశ్యకత గురించి సీఐడీ హెడ్ క్వార్టర్స్ అడిషనల్ ఎస్పీ సీహెచ్ సురేశ్ వివరించారు. ఉదయం సెషన్‌లో ఉమ్మడి గోదావరి జిల్లాల పోలీసు సిబ్బంది, జీఎంఎస్‌కే, మధ్యాహ్నం సెషన్‌లో కాలేజీ విద్యార్థులు, బ్యాంకు సిబ్బంది, నెట్‌వర్క్ ప్రొవైడర్లు హాజరయ్యారు. వారికి సైబర్ క్రైంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విశదీకరించడంతో పాటు సంబంధిత మెటీరియల్‌ని అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు బి.రామకృష్ణ, సీహెచ్ వెంటారావు, ఇన్‌స్పెక్టర్లు జీవీవీ సత్యనారాయణ, ఎం.బాల కృష్ణ, ఐ.గోపాలకృష్ణ, డి.విజయ్‌కుమార్, పీవీవీ నరసింహరావు, ఎం.శేషు, వి.శ్రీనివాస్, సీహెచ్ వెంకటేశ్వరరావు, జి.రమేశ్ పాల్గొన్నారు.

దళిత సర్పంచ్‌పై అధికార పార్టీ వేధింపులు

- సర్పంచ్‌కు సమాచారం లేకుండా డీపీవో సమావేశం
- అధికార పార్టీ నాయకుడి ప్యాలెస్ సీసీ రోడ్డు నిర్మాణానికి తీర్మానం



ఆత్రేయపురం గ్రామపంచాయతీలో డీపీవో కృష్ణకుమారి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జనవరి 27: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం గ్రామ దళిత సర్పంచ్ గెడ్డం సుధారాణిపై అధికారపార్టీ వేధింపులకు పాల్పడుతుందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. 2020లో జరిగిన పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్‌గా సుధ టీడీపీ తరుపున ఎన్నికయ్యారు. వార్డు సభ్యులు అధికార పక్షానికి చెందిన వారు కావడంతో దళిత సర్పంచ్‌కు అధికార పార్టీ నాయకులు వేధింపులకు పాల్పడుతున్నారని సుధ ఆరోపిస్తున్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికార పార్టీ నాయకులు ఇబ్బందులకు గురిచేస్తుండగా అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆమె పేర్కొన్నారు. పంచాయతీకి స్వాధీనం చెయ్యని భూమిలో అధికార పార్టీ నాయకుడికి చెందిన ప్యాలెస్‌కు సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించేందుకు నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ వార్డు సభ్యులు తీర్మానం ఆమోదించడం సర్పంచ్‌లు వ్యతిరేకించడంతో వివాదం చెలరేగింది. శనివారం సర్పంచ్ సుధకు తెలియకుండానే డీపీవో కృష్ణకుమారి అభ్యర్థన మీటింగ్‌ను పంచాయతీలో నిర్వహించడంతో విషయం తెలుసుకున్న సర్పంచ్ అక్కడికి చేరుకుని డీపీవోను నిలదీశారు. సర్పంచ్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా అభ్యర్థన మీటింగ్ నిర్వహించడం ఎంతవరకూ న్యాయమని ఆమె ప్రశ్నించారు. పేద ప్రజలకు అవసరమైన కనీస పనులను అభివృద్ధికి అడ్డుతగులుతూ అధికార పార్టీ నాయకుడికి స్వప్రయోజనం చేకూర్చే పనులు ఆమోదించడం ఎంత వరకూ సబబు అని ఆమె నిలదీశారు. సర్పంచ్ అభ్యంతరాలను లెక్కచేయని డీపీవో కృష్ణకుమారి అధికార పార్టీకి అనుకూలంగా వర్క్స్ కమిటీని ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్ ఆమోదంకోసం నివేదికను పంపించడంపై సర్పంచ్ మండిపడ్డారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఈవిషయంపై డీపీవో కృష్ణకుమారిని వివరణ కోరగా వార్డు సభ్యుల అభ్యర్థన మేరకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి పనులకు ఆమోదం తెలపలేదని మెజార్టీవార్డు సభ్యుల అభిప్రాయం మేరకు ఏడుగురుతో వర్క్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. దీనిని కలెక్టర్ ఆమోదం కోసం పంపించామన్నారు.

చీటింగ్ నేరంపై అవుట్‌సోర్సింగ్ సిబ్బంది అరెస్ట్

సామర్లకోట, జనవరి 27: సామర్లకోట మున్సిపాల్టీలో అవుట్‌సోర్సింగ్ సిబ్బందిగా పనిచేస్తున్న కమ్మిల శ్రీనువాస్ అనే యువకుడు ఒక మహిళా వివాదాన్ని సెటిల్మెంట్ చేస్తానని, తాను చెబితే అధికారులు, రాజకీయ నాయకులు సిఫార్స్ చేస్తారని నమ్మబలికి ఆమె వద్ద నుంచి రూ.1.27లక్షలు వసూలు చేసి ఆ తర్వాత ముఖం చాటేసిన కేసులో శ్రీనువాస్‌ను సామర్లకోట పోలీసులు అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపర్చడంతో రిమాండ్ విధించినట్లు సామర్లకోట పోలీసులు తెలిపారు. తనకు జరిగిన ఒక సంఘటనలో ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు రాగా సదరు మహిళను నమ్మించి తనకు పలుకుబడి ఉందని చెప్పి ఆమె నుంచి డబ్బులు వరుసగా వసూలు చేశాడు. తీరా తన సమస్య పరిష్కారం కాకపోవడంతో నేరుగా పోలీసు అధికారులకు జరిగిన మోసాన్ని వివరించడంతో పోలీసులు తక్షణం విచారించి మోసాలకు పాల్పడినట్లు నిర్ధారించి అరెస్ట్‌చేసి కోర్టు ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు సామర్లకోట పోలీసులు శనివారం తెలిపారు. ఇక నుంచి శ్రీనువాస్‌ను మున్సిపల్ విధులకు అనుమతించేది లేదని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

శ్రీమాతా కన్సల్టెన్సీ (రిజి)

సెల్ : 98480 49875 AJD 144172

వధూ, వరులు కావలెను

సెల్ : 9848049875

AJD:144173

ఛార్‌ధామ్ రైలు యాత్ర

తేది.12-06-24. 16 రోజులు టిక్కెట్ 32,000/-, రామేశ్వరం బస్సు యాత్ర తేది: 06-02-24. 5 రోజులు టిక్కెట్ 8000/-. కె.వాసు, నెల్లూరు. సెల్: 94913 40504

AJR-156671

WANTED

➡ 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు మండలానికి ఒక్కరూ మాత్రమే డీలర్ కావలెను. సంప్ర: 9490679396, 9493786468.

AJG-184167

PROPERTY TO RENT

★ రాజమండ్రి, లాలాచెరువు - 2800 sft గోడౌన్ / ఆఫీస్ స్పేస్ for RENT, Mobile : 9916499111 AJH-01483

4 Lines CLASSIFIED Rs.230/- Only

చెట్టుని ఢీ కొట్టిన కారు

- షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం



చెట్టుకు ఢీకొని దగ్ధమవుతున్న కారు

యానాం, జనవరి 27: యానాం శివారు ఇసుకకాలువ వద్ద అదుపుతప్పి కారు రోడ్డు డివైడర్‌ను, చెట్టును ఢీకొట్టింది. షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం యానాం నుంచి స్నేహితులతో కలిసి దొమ్మేటిపేటలో ఉన్న స్నేహితుడి కొబ్బరితోటలో భోజనాలు చేయటానికి వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ ఇసుక కాలువ వద్ద అదుపుతప్పి ఒక పక్కకు ఒరిగింది. ప్రమాదం జరిగే సమయానికి నలుగురు యువకులు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. కారులో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో క్షణాల వ్యవధిలో కారు దగ్ధమైంది. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న అగ్నిమాపక వాహనం మంటలను అదుపుచేసింది. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. అయితే కారులో ఉన్న వారు యానాం వాసులుగా గుర్తించారు. వీరిలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా మెరుగైన వైద్యంకోసం కాకినాడ తరలించారు. ఈసంఘటనలో కారు పూర్తిగా దగ్ధమైంది. ఈసంఘటనపై యానాం ట్రాఫిక్ ఎస్ఐ పువ్వల వీరభద్రస్వామి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కె.పెదపూడి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

- నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేసిన సర్పంచ్
- కార్యదర్శి ఫిర్యాదుతో చెక్ పవర్ రద్దు చేసిన డీపీవో

అంబాజీపేట, జనవరి 27: నిబంధనలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం అందించిన 15వ ఆర్థిక సంఘం నిధులను చెక్ ద్వారా బ్యాంకు నుంచి నేరుగా డ్రా చేసిన అంబాజీపేట మండలం కె.పెదపూడి సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి కె.కృష్ణకుమారి ఉత్తర్వుల జారీ చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడి మేజర్ పంచాయతీకి గత ఏడాది ఆగస్టు నెలలో 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.4లక్షలు పంచాయతీ ఖాతాకు జమయ్యాయి. గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లకు సంబంధించి వీటిని చేసినట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఖాతాకు జమ అయిన మరుసటిరోజు నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ కార్యదర్శి విత్తనాల వెంకటరమణకు తెలియకుండా సర్పంచ్ బీర శాంతి బ్యాంకు నుంచి చెక్ ద్వారా రూ.3.70 లక్షలు డ్రా చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ గ్రామ్ స్వరాజ్ ద్వారా సీఎఫ్ఎంఎస్ ద్వారా అప్‌లోడ్ చేసి నిధులు డ్రా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ నిబంధనలకు వ్యతిరేకంగా సర్పంచ్ శాంతి నిధులు డ్రా చేయడంతో పంచాయతీ కార్యదర్శి గత ఏడాది జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. డిసెంబర్ నెలలో డివిజనల్ పంచాయతీ అధికారి బొజ్జిరాజు, అంబాజీపేట ఈవోపీఆర్డీ బి.మమత పంచాయతీ విత్‌డ్రా చేయడంపై స్థానిక పంచాయతీలో విచారణ చేపట్టారు. విచారణ అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక అందించారు. విచారణను పరిశీలించిన డీపీవో సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దుచేస్తూ జనవరి 25వ తేదీన ఉత్తర్వులు అందించారు. ఈ ఉత్తర్వులను సర్పంచ్‌కు రిజిష్టర్ పోస్టుతో పాటు స్వయంగా అందించాలని తెలిపినట్లు ఈవోపీఆర్డీ మమత తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

- కుమార్తెను చూసి వెళుతుండగా ప్రమాదం
- మోటారు సైకిల్‌ను మినీ వ్యాన్ ఢీకొని మృతి



రోళ్లపాలెం బైపాస్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన భార్యాభర్తలు గారపాటి వెంకట్రావు, మంగతాయారు

అమలాపురం రూరల్, జనవరి 27: అత్తవారింటి వద్ద ఉన్న కుమార్తెను చూసేందుకు పిల్లావారిగరువుకు వచ్చిన భార్యాభర్తలు తిరుగు ప్రయాణంలో మోటారుసైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన మినీవ్యాన్ వేగంగా వచ్చి మోటారుసైకిల్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన రోళ్లపాలెం బైపాస్ రోడ్డులో శనివారం రాత్రి జరిగింది. అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం బోడసకుర్రులోని టిడ్కో గృహాల సముదాయంలో ఉంటున్న గారపాటి వెంకట్రావు(55), భార్య మంగతాయారు(50)లు కుమార్తెను చూసేందుకు మండల పరిధిలోని పిల్లావారిగరువుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో బైపాస్ రోడ్డులో బోడసకుర్రువైపు వెళుతుండగా రోళ్లపాలెం సమీపానికి వచ్చేసరికి మినీవ్యాన్ డ్రైవరు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ కె.క్రిష్టఫర్, రూరల్ సీఐ పి.వీరబాబు, అల్లవరం, పట్టణ ఎస్ఐలు హరీష్‌కుమార్, సత్యనారాయణలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన వ్యాను డ్రైవరుపై కేసు నమోదుచేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.



రాజమండ్రి : రంభ	తాటిపాక: శ్రీనివాస
కాకినాడ : దేవిమల్టీప్లెక్స్	జగ్గంపేట : నాగేశ్వర
కాకినాడ : ఆనంద్‌సినిమాస్	కొత్తపేట : సత్యచంద్ర
కాకినాడ : PVR INOX Ltd	గోకవరం : శ్రీనివాస
వాకలపూడి : సూర్యసినీమాక్స్	ఏలేశ్వరం : జయశ్రీ
అమలాపురం: లలిత	ధవళేశ్వరం : మురళీకృష్ణ
మండపేట : విజయమహల్	అన్నవరం : NVR మల్టీప్లెక్స్
పిఠాపురం : అన్నపూర్ణ	మలికిపురం : పద్మకాంప్లెక్స్
పిఠాపురం : వీరభద్ర	కత్తిపూడి : సత్యనారాయణ
రావులపాలెం: పద్మశ్రీ	లక్కవరం : వేణుగోపాలకాంప్లెక్స్
రామచంద్రపురం: అన్నపూర్ణ	

గొంచాలలో వాటర్ ట్యాంక్ ప్రారంభం

సామర్లకోట, జనవరి 27: మండలంలోని గొంచాల గ్రామ శ్మశానం ఆవరణలో ప్రజలు స్నానాలు చేసేందుకు అవసరమైన వాటర్ ట్యాంక్‌ను రూ.2లక్షల సొంత నిధులతో అమజాల వీవీ. సూర్యనారాయణ (దొరబాబు) దంపతులు నిర్మించి శనివారం ప్రజలకు అంకితం చేశారు. తన తల్లితండ్రులు అమజాల రమామణి,లక్ష్మణరావుల జ్ఞాపకార్థం దొరబాబు ట్యాంక్‌ను నిర్మించారు. ఆయన ఉదారతను గ్రామస్తులు పలువురు కొనియాడారు.

'కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌ను పునరుద్ధరించాలి'

కాకినాడ సిటీ, జనవరి 27: కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌ను పునరుద్ధరించాలని సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు చేపట్టిన నిరాహార దీక్ష శనివారం రెండోరోజుకు చేరింది. దీక్షకు ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు సంఘీభావం తెలుపుతూ దీక్షా శిబిరంలో నిరసన తెలిపారు. రాజ్యాంగం ప్రకారం నిరసన తెలియజేసే హక్కును ప్రభుత్వం అణచివేస్తోందని ఆమ్ ఆద్మీ జిల్లా కన్వీనర్ నరాల శివ విమర్శించారు. జిల్లా కలెక్టర్ తక్షణం అఖిలపక్ష కమిటీ వేసి ధర్నా చౌక్ విషయమై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మద్దతు తెలిపినవారిలో జిల్లా కార్యదర్శి కాశ్యూరి కృష్ణమోహన్, జిల్లా కోకన్వీనర్ మేడిశెట్టి రామ్మోహన్, ప్రభాకరరెడ్డి, మహమ్మద్ షాకీర్ ఉన్నారు.

'ఆశలను ఆశయాలుగా మార్చడమే ధ్యేయం'

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 27: విద్యార్థుల ఆశలను ఆశయాలుగా మార్చడమే ధ్యేయమని శ్యామ్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకుడు గుంటూరి శ్యామ్ పేర్కొన్నారు. కాకినాడ రోటరీ క్లబ్ గోల్డెన్‌జూబ్లీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో శ్యామ్‌ని ఘనంగా సత్కరించారు. రోటరీక్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్‌వీఎస్.రావు అసిస్టెంట్ గవర్నర్ ఉదయభాను, సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర సభ్యులు ఈ సత్కారం నిర్వహించారు. శ్యామ్ మాట్లాడుతూ రోటరీ వంటి సేవాసంస్థ సన్మానం స్వీకరించడం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఎస్‌వీఎస్.రావు మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగాలకు కేరాఫ్ అడ్రస్‌గా శ్యామ్ ఇనిస్టిట్యూట్ నిలిచిందన్నారు. అధ్యక్ష, కార్యదర్శులు నరహరిశెట్టి రవికృష్ణ, జోగా చంద్రరావు, మాచారెడ్డి, చిరంజీవిరెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.

'గ్రామసభ అని పత్తా లేకుండా పోయారు'

సామర్లకోట, జనవరి 27: వేట్లపాలెం గ్రామ పంచాయతీ గ్రామ సభను శనివారం నిర్వహిస్తామని పాలకవర్గమందరూ హాజరుకావాలని సమాచారం ఇచ్చిన పంచాయతీ అధికారులు శనివారం పత్తా లేకుండా పోయారని సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్, వార్డు సభ్యులు గోలి వెంకటరావు, ప్రత్తిపాటి వీరన్న, కనుగొండ చిన్ని, పైలా వెంకటలక్ష్మి, వేగుళ్ళ నరసమ్మ, దేశెట్టి భూలక్ష్మి, బూడిద శ్రీనివాసరావు, అడబిల్లి వెంకటరమణ ఆరోపించారు. సమావేశం కోసం సుమారు 2గంటలు వేచి ఉన్నప్పటికీ ఎవరూ రాకపోవడంతో ఎంపీడీవో కార్యాలయ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో వీకె.రాయపురం పంచాయతీ కార్యదర్శి శ్రీహరి వేట్లపాలెం చేరుకుని పంచాయతీ పాలకవర్గం చేసిన ఫిర్యాదులపై స్పందించి సోమవారం పంచాయతీ గ్రామ సభ నిర్వహిస్తామని హామీ ఇవ్వడంతో పాలకవర్గ సభ్యులు వెనుదిరిగారు.

జ్యోతుల నెహ్రూను కలిసిన పాఠంశెట్టి బాబ్జి

జగ్గంపేట, జనవరి 27: జగ్గంపేట జనసేన పార్టీ ఇన్‌చార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర సోదరుడు, జనసేన క్రియాశీలక సభ్యుడు పాఠంశెట్టి బాబ్జి జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి ఎన్నికల్లో నెహ్రూకు విజయం సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను కలిశారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, అడబాల వెంకటేశ్వరరావు, నీలం శ్రీను, వీరంరెడ్డి కాశీబాబు, కొత్త కొండబాబు, కుంచే తాతాజీ, పాఠంశెట్టి మురళీకృష్ణ, కర్నాకుల పెద్దకాపు, దావర్తి సీతారామయ్య, కుంచే శ్రీనివాస్, సుంకవిల్లి రాజు, తోట వెంకటేశ్వరరావు, పొట్రూ కృష్ణమూర సత్తిబాబు, సంగిరెడ్డిరమేష్, పదిలం రాంబాబు తదితరులున్నారు.

దళిత నేత జానకిరాముడు మృతి

తాళ్లరేవు, జనవరి 27: దళిత నేత అంబేడ్కరిస్ట్, విశ్రాంత ఉపాధ్యాయుడు, సీనియర్ కామ్రేడ్, బోధిసత్వ ఉపాసక కాశి జానకిరాముడు(85) కాకినాడలో ప్రవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందారు. జానకిరాముడు భౌతికాయాన్ని జార్జీపేటగ్రామం సీలాంద్రిపేట స్వగృహానికి తరలించారు. జడ్పీ మాజీచైర్మన్ దున్నా జనార్ధనరావు, రిటైర్డ్ ఆర్‌టీవో నామాడి అప్పారావు, జాతీయ మాలమహానాడు అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్, సీపీఎం నేత టేకుమూడి ఈశ్వరరావు, ఎమ్‌డియుడబ్ల్యూ అధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు జక్కల ప్రసాద్‌బాబు, బుద్ధిస్ట్ సొసైటీ జిల్లా అధ్యక్షులు గుత్తాల శ్రీరాములు, మోనటరింగ్ కమిటీ సభ్యులు అయితాబత్తుల రామేశ్వరరావు జానకిరాముడు భౌతికకాయానికి నివాళులర్పించారు.

ఎన్టీఆర్ క్యాలెండర్ ఆవిష్కరణ

సర్పవరం జంక్షన్, జనవరి 27: స్థానిక ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో శనివారం సినీనటుడు ఎన్టీఆర్ క్యాలెండర్‌ని ఎన్టీఆర్ వీరాభిమాని తురగా సూర్యారావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ క్యాలెండర్‌ని ఆవిష్కరించడం తనకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. క్యాలెండర్లను ఆల్ ఇండియా ఎన్టీఆర్ ఫ్యాన్స్ కర్నాటక తెలుగు ఫెడరేషన్ కన్వీనర్ కేవీ సుబ్రహ్మణ్యం సమకూర్చినట్లు తెలిపారు. శిరీష, రేలంగి బాపిరాజు, నగేష్,లక్ష్మణరావు, రమాసుందరి, శ్రీదేవి రెడ్డి,ప్రసూన, సత్యనారాయణచౌదరి ఉన్నారు.

బాస్కెట్‌బాల్ కోర్టు, క్రీడా సామగ్రి అందజేత

పిఠాపురం, జనవరి 27: పట్టణంలోని పాతబస్టాండు మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.80లక్షలతో నూతనంగా నిర్మించిన బాస్కెట్‌బాల్ కోర్టును, రూ.5లక్షలు విలువైన క్రీడాసామగ్రిని క్రీడాకారులకు శనివారం రాత్రి కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ అందించారు. బాస్కెట్‌బాల్ కోర్టు నిర్మాణానికి కృషి చేసిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావును అభినందించారు. అనంతరం క్రీడాకారులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు కృష్ణవేణి, బొజ్జా మాణిక్యాలరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.చక్రవర్తి, కోచ్ రుద్ర, పలువురు ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

కొయ్యూరు, జనవరి 27: మండలంలోని పెదమాకవరం గ్రామ సమీపంలో శనివారం ట్రాక్టర్ బోల్తా పడడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. కొయ్యూరు ఎస్‌ఐ కె.రామకృష్ణ అందించిన వివరాలు.. కాకినాడ జిల్లాలోని పెదపూడి గ్రామానికి చెందిన చిట్టూరి నాగేశ్వరరావు (50) కొయ్యూరులోని శరభన్నపాలెంలో కౌలు చేస్తున్న భూమిలో పండిన వరి గడ్డిని తీసుకువెళ్లడానికి తన కుమారుడు శ్రీనుతో కలిసి వచ్చారు. గడ్డి లోడ్ చేసుకుని శనివారం తెల్లవారు జామున వెళ్తుండగా పెద మాకవరం సమీపంలోని కొండ కాలువలో అదుపుతప్పి దూసుకుపోయారు. దీంతో ట్రాక్టర్ ఇంజన్ కింద నాగేశ్వరరావు చిక్కుకుని ప్రాణాలు కోల్పోయాడు. శ్రీను ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పెద్దాపురం, జనవరి 27: మండల పరిధిలోని చంద్రమాంపల్లిలో ఓ మహిళ మెడలో గొలుసు చోరీ జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పిఠాపురం మండలం విరవాడ గ్రామానికి చెందిన ఓమహిళ తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి దర్శనం కోసం వస్తున్న సమయంలో దుండగులు మోటార్ సైకిల్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న మంగళ సూత్రాలు, బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఇంతలో స్థానిక మహిళలు కేకలు వేయడంతో మంగళ సూత్రాలను వదిలి బంగారు గొలుసును పట్టుకెళ్లిపోయారు. ఈ విషయంపై ఎస్‌ఐ సురేష్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌కు శంకుస్థాపన

జేఎన్టీయూకే, జనవరి 27: వర్సిటీ మైదానంలో ఖేలో ఇండియా పథకలో భాగంగా మంజూరైన 400మీటర్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణానికి ఆదివారం కాకినాడ ఎంపీ వంగాగీత శంకుస్థాపన చేయనున్నారని ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్‌ప్రసాద రాజు తెలిపారు. ఈట్రాక్ నిర్మాణానికి మొత్తం రూ.13.55 కోట్ల నిధులు అవసరం కాగా కేంద్రప్రభుత్వం రూ.9.50 కోట్లు మంజూరుచేయగా దానికి మ్యాచింగ్ గ్రాంట్‌గా యూనివర్సిటీ నుంచి రూ.4.05 కోట్ల నిధులు విడుదల జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు.

నేడు రాష్ట్రస్థాయి ఎడ్ల బండ్ల పోటీలు

ప్రత్తిపాడు, జనవరి 27: మండలంలోనిధర్మవరం గ్రామంలో ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించనున్నారు. గౌరీశంకర్ల 87వ వార్షికోత్సవ మహోత్సవాలు సందర్భంగా నిర్వహించే ఈ పోటీల్లో సీనియర్స్ విభాగంలో ప్రథమవిజేతకు రూ.15 వేలు, రెండో విజేతకు రూ.12వేలు, మూడో విజేతకు రూ.8వేలు.. జూనియర్స్ విభాగంలో ప్రథమ విజేతకు రూ.12వేలు, రెండో విజేతకు రూ.8వేలు మూడో విజేతకు రూ.6 వేలు ట్రోఫీలు అందజేయనున్నారు. పోలవరం గట్టు వద్ద విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.

ఈ రహదారులు ఇంతేనా?

గతుకుల రోడ్లలో ప్రయాణికులకు ఇక్కట్లు

అసంపూర్తిగా మరమ్మతులు



కొత్తపల్లి:ఉప్పాడ బీచ్‌లో ఛిద్రమైన రోడ్డు



సామర్లకోట:ముత్యాలమ్మ గుడి సమీపాన గొయ్యి

ఉప్పాడ (కొత్తపల్లి), జనవరి 27: ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే బీచ్‌రోడ్డు గతుల రహదారిగా తయారైంది. స్థానిక విద్యుత్‌ప్లాంటు సమీపం నుంచి నేమాం సెంటర్‌కు వెళ్లే దారిలో సముద్రానికి అనుకొని బీచ్‌రోడ్డు ఛిద్రమైంది. ఇక్కడ పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. అదేవిధంగా నేమాం గెస్ట్ హౌస్‌కు వెళ్లే సమీపంలో కల్వర్టు బాగా ఛిద్రమైంది. కల్వర్టు ఒక పక్క బాగా కుంగింది. దీంతో పెద్ద గొయ్యి ఏర్పడింది. రాత్రిపూట ఈ దారిలో ప్రయాణించే వాహనాలు కల్వర్టు గొయ్యిలో పడి ప్రమాదాల పాలవుతున్నాయి. కొంచెం దూరంలో సముద్రం వైపునకు రోడ్డుకు పెద్ద అగాధం లాంటి గొయ్యి ఏర్పడింది. దీనిలో గ్రావెల్ నింపారు. ఐనప్పటికీ ఒకేసారి ఎదురురెదురుగా వచ్చే వాహనాలు గ్రావెల్ నింపిన రోడ్డువద్దకు చేరేసరికి తప్పించుకుని వెళ్లేందుకు గంటల తరబడి సమయం పడుతుంది. ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి ఈ రోడ్డునే ప్రయాణిస్తున్నా బీచ్‌రోడ్డు దుస్థితిపై దృష్టి సారించకపోవడం పట్ల ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతుల రహదారిగా ఉన్న బీచ్‌రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

సామర్లకోట-కాకినాడ రహదారిలో...

సామర్లకోట, జనవరి 27: సామర్లకోట-కాకినాడ ప్రధాన రహదారిలో పనులను అసంపూర్తిగా వదిలి వేయడం వల్ల ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుకు గత ఐదేళ్లుగా ఏ మరమ్మతులు చేపట్టకపోవడంతో పెద్దపెద్ద గోతులుగా మారి నిత్యం ఏదో ఒక వాహనం ఆ గోతిలో ఇరుక్కుని ప్రమాదాలు జరుగుతున్నాయి. చీకటి పడితే ఈ రోడ్డున ప్రయాణించాలంటే వాహనదారులు ప్రాణాలు అరచేత పట్టుకుని వెళ్లాల్సిందే. ఇటీవల పత్రికల్లో ఈ రోడ్డు దుస్థితిలో కథనాలు రావడంతో మరమ్మతులు చేపట్టేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ అధికారులు వెంకటకృష్ణరాయపురం గ్యాస్ పైప్ లైన్ జంక్షన్ నుంచి కాకినాడ ఇంద్రపాలెం వరకూ పనులు చేశారు. అయితే వెంకట కృష్ణరాయపురం గ్యాస్ పైప్‌లైన్ నుంచి సామర్లకోట వరకూ ఉన్న గోతులను అలాగే వదిలేశారు. దీంతో వాహనదారులు పెద్దపెద్ద గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గురువారం ఉదయం సైతం ఒక ద్విచక్ర వాహనం వీకె.రాయపురం గ్రామ సమీపాన గోతిలో పడి అదుపుతప్పడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చేరారు. ఈ రోడ్డుకు పూర్తిగా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'టీడీపీ విజయానికి కృషి'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాససాయి

తాళ్లరేవు, జనవరి 27: తెలుగుదేశం పార్టీ విజయానికి నేతలంతా కృషి చేయాలని, అవినీతి వైసీపీని ఇంటికి పంపించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల శ్రీనివాససాయి అన్నారు. శనివారం తాళ్లరేవు పార్టీ కార్యాలయంలో ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు, బూత్‌కన్వీనర్లు, సమన్వయకర్తలకు ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జిగా వ్యవహరించిన శ్రీనివాససాయి మాట్లాడుతూ ప్రజలంతా ఎన్నికల కోసం సిద్ధంగా ఉన్నారని.. టీడీపీ కార్యకర్తలు, నేతలు సమన్వయంతో పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని బోళ్ల రాజేష్, గుత్తుల గణపతి పర్యవేక్షించారు.

'కులగణన...రాజకీయ రోదన'

కార్పొరేషన్, (కాకినాడ) జనవరి 27: ప్రభుత్వం చేపట్టిన కులగణన రాజకీయ రోదనగా ఉందని జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు ముత్త శశిధర్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో కులగణనను ప్రశ్నిస్తు పోస్టర్‌ను విడుదల చేశారు. తమ నాయకుడు పవన్ కల్యాణ్ స్పందించిన ప్రశ్నలకు త్వరలో మాజీ కాబోయే ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. ఇన్నాళ్లు గుర్తుకురాని ప్రజా సంక్షేమం ఇప్పుడే గుర్తుకొచ్చినట్లు కులగణన పేరుతో వలంటీర్ల ద్వారా ప్రజలు వ్యక్తిగత వివరాలు సేకరిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు కులాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందడానికే ఈ ప్రయత్నమని వ్యక్తమవుతుందన్నారు. కార్యక్రమంలో అడబాల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

'టిడ్కో గృహాలు అప్పగించాలి'

పిఠాపురం, జనవరి 27: సొమ్ములు చెల్లించి ఏడేళ్లు గడుస్తున్నా ఇంత వరకూ టిడ్కో అపార్ట్‌మెంట్లు అప్పగించకపోవడంపై పలువురు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంతా టీడీపీ కౌన్సిలరు కోళ్ల బంగారుబాబుతో కలిసి పిఠాపురం పురపాలకసంఘ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. టిడ్కో అపార్ట్‌మెంట్లు పూర్తయినా అప్పగించక ఐదేళ్లుగా అద్దె గృహాల్లో అనేక ఇబ్బందులు పడుతున్నామని, తమకు తక్షణం అపార్ట్‌మెంట్లు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనరు కృష్ణవేణికి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ రాసిన వినతిపత్రం అందజేశారు.

'ఆసరా' చెక్కుల అందజేత

పిఠాపురం రూరల్, జనవరి 27: పిఠాపురం మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం వైఎస్సార్ ఆసరా పథకం నాల్గో విడత కింద మహిళా సంఘాలకు మంజూరైన రూ.13.51కోట్ల చెక్కును కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, జడ్పీ వైస్‌చైర్మన్ బుర్రా అను బాబు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

కొత్తపల్లి: మండలంలో సుమారు 1620 మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా ద్వారా మంజూరైన రూ.13.18కోట్ల చెక్‌ను స్థానిక సురక్ష ప్యాలెస్‌లో పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ అందజేశారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, కొత్తపల్లి ఎంపీపీ కారే సుధ, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, వైసీపీ కొత్తపల్లి మండలాధ్యక్షుడు అనాల సుదర్శన్, కొత్తపల్లి ఎంఎస్ఎస్ ఏపీఎం షకీనా ప్రియదర్శిని, మత్స్యకార మహిళా సమాఖ్య సీసీఎస్ శ్రీధర్, ఉమ్మిడిజాన్ తదితరులు ఉన్నారు.

తుని మున్సిపల్ కమిషనర్ బదిలీ

తుని రూరల్, జనవరి 27: తుని మున్సిపల్ కమిషనర్ బి.ప్రసాద్‌రాజును ఏలూరు అర్బన్‌డెవలప్‌మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఏ.వెంకటేశ్వరరావు తుని మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

కాకినాడ క్రైం, జనవరి 27: సామర్లకోట మండలంలో సారా తయారీ బట్టీలపై ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. పిఠాపురం మండలం జల్లూరు గ్రామానికి చెందిన గంజా గంగాధర్ అనే వ్యక్తి నిర్వహిస్తున్న నాటు సారా తయారీ కేంద్రాన్ని గుర్తించారు. 1200 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేసి, 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని కాకినాడ నార్త్‌స్టేషన్ అధికారులకు అప్పగించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

కాకినాడలో క్రాఫ్ట్ బజార్

సర్పవరం జంక్షన్, జనవరి 27: చేతి వృత్తుల కళాకారులతో తయారు చేసిన చేనేత వస్త్రాలు, హస్త కళలను ప్రోత్సహించేందుకు కళాత్మక వస్తువులు కొనుగోలు చేసి ప్రోత్సహించాలని క్రాఫ్ట్ బజార్ మేనేజర్ వై.వెంకటేశ్వరరెడ్డి కోరారు. స్థానిక జేఎన్‌టీయూకే ఎదురుగా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ బజార్ ఎగ్జిబిషన్‌లో సుమారు 80 స్టాల్స్‌లో కళాకారులు రూపొందించిన పలు ఐటమ్స్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. క్రాఫ్ట్ బజార్ ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ డే

పెద్దాపురం, జనవరి 27: ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్ల యూనియన్ (పీఈటీయూ) అంతా ఐక్యంగా ఉండాలని సంఘ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక జె.కొత్తూరు రహదారిలో నిర్వహించిన ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు.

బీసీలకు వెన్నుపోటు పొడిచిన జగన్

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ



సభలో మాట్లాడుతున్న వర్మ

గొల్లప్రోలు, జనవరి 27: ఒక్క అవకాశమంటూ అధికారంలోకి వచ్చిన జగన్ బీసీల పథకాలన్నింటిని రద్దు చేయడంతో పాటు వారికి ప్రత్యేకించిన బీసీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించి వెన్నుపోటు పొడిచారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ మండిపడ్డారు. అడుగడుగునా బీసీలకు అన్యాయం చేసిన జగన్ ఇప్పుడు ఎన్నికలు వచ్చేసరికి బీసీల జపం చేస్తున్నారని విమర్శించారు. గొల్లప్రోలు పట్టణ శివారులోని తన అతిథి గృహం వద్ద గొల్లప్రోలు పట్టణం, మండలానికి సంబంధించి జయహో బీసీ సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు, వర్మ మాట్లాడుతూ బీసీలకు రాజకీయ, సామాజిక ప్రాధాన్యత కల్పించడంతో పాటు ఆర్థికంగా బలోపేతం చేసేలా చేసింది నందమూరి తారకరామారావు అని, దానిని కొనసాగించింది చంద్రబాబు ఒక్కరేనని తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు సంబంధించిన సంక్షేమ పథకాలు అన్నింటికి మంగళం పాడిందని చెప్పారు. 3 దశాబ్దాలుగా పిఠాపురం నియోజకవర్గ ప్రజల్లో ఒకడిగా, వారికి అన్నివేళలా అందుబాటులో ఉంటూ కష్టసుఖాల్లో అండగా ఉన్నానని వర్మ తెలిపారు. ఇప్పుడు పొన్నూరు నుంచి నాయకులు వచ్చి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని వారిని తరిమికొట్టాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు బోళ్ల వెంకటరమణ, జిల్లా బీసీసెల్ ప్రధాన కార్యదర్శి కొల్లు బోయిన శ్రీనివాసయాదవ్, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, పిల్లి చిన్నా, పడాల అప్పారావు, చొక్కా దావీదు, శీరం మాణిక్యం, బర్ల అప్పారావు, మొల్లి నాగమరిడిరాజు, గుళ్ల సుబ్బన్న, మల్లిపూడి వీరబాబు, రాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీలకు అండగా నిలవాలని కార్యాచరణ

ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి సత్యప్రభ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యప్రభ

శంఖవరం, జనవరి 27: దేశంలోనే తొలిసారి బీసీలకు రక్షణచట్టం తీసుకొచ్చి వారికి అండగా నిలవాలని చంద్రబాబు కార్యాచరణ రూపొందించారని ఈ మేరకు బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీలో పొందుపరిచారని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ అన్నారు. బీసీ నేతల ఆధ్వర్యంలో సీతంపేటలో శనివారం నిర్వహించిన జయహో బీసీ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బీసీల అభ్యున్నతికి టీడీపీ కృషి చేసిందని, జగన్ పాలనలో బీసీలు అణిచివేతకు గురయ్యారన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీ కార్పొరేషన్లు నిర్వీర్యం అయ్యాయని, చైర్మన్లు కేవలం ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారని మండిపడ్డారు. రాజకీయ నిరుద్యోగులకు పదవులు ఇచ్చారని, కార్పొరేషన్ల పెత్తనమంతా అగ్రకులాలే చెలాయిస్తున్నారని ఆరోపించారు. జగన్‌తో బీసీలు ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందని ఇప్పటికైనా మేల్కొని తెలుగుదేశం విజయానికి బీసీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహ కార్యదర్శి తాళ్ళాబత్తుల సాయి, బీసీసంఘం జిల్లా అధ్యక్షుడు కొమిరిశెట్టి నర్సింగరావు, పెరిక సాధికారిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనపర్తి బద్రి, పార్టీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు, వాణిజ్య విభాగం కార్యదర్శి ఈగల దేవుళ్ళు, పైల సాంబశివరావు, గ్రామ అధ్యక్షుడు పిర్ల అప్పారావు, క్లస్టర్ ఇన్‌చార్జి బద్ది రమణ, కంచిబోయిన శ్రీను, బద్ది రామకృష్ణ, సూర్యనారాయణ ఉన్నారు.

ప్రజలందరికీ అండగా ఉంటా : యనమల దివ్య



రాపాకలో ప్రచారం నిర్వహిస్తున్న దివ్య

తుని రూరల్, జనవరి 27: రాపాక ప్రజలు ఆశీర్వదించాలని, అందరికీ అండగా ఉంటానంటూ తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య అన్నారు. మీ ఇంటికి మీదివ్య కార్యక్రమంలో మండలంలోని రాపాక గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుందని, మద్యపానాన్ని నిషేదిస్తానన్న ముఖ్యమంత్రి కల్తీ మద్యంతో ప్రజలు ప్రాణాలు బలిగొంటున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల వేళ సరైన నిర్ణయం తీసుకోవాలని టీడీపీ, జనసేన కూటమికి పట్టం కట్టి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పోల్నాటి శేషగిరిరావు, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, ఎస్.సూరవరం మాజీ సర్పంచ్ చింతమనీడి నాగ సోమరాజు(అబ్బాయి), మంతెన గంగరాజు, గంధం బాబ్జి, ఉండా రాము, జి.రమణ తదితరులు ఉన్నారు. రాపాకలో వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురు వార్డుమెంబర్లు చేశారు. వారికి యనమల శివరామకృష్ణన్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన వెంట మండలానికి చెందిన టీడీపీ నాయకులు ఉన్నారు.

భూ హక్కు చట్టంపై అవగాహన సదస్సు

ప్రత్తిపాడు, జనవరి 27: మండలంలోని పాండవుల పాలెం గిరిజన గ్రామంలో శనివారం ఐలాజ్ ఆధ్వర్యంలో భూ హక్కుచట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐలాజ్ కన్వీనర్ బుగతా శివ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ హక్కుచట్టం వల్ల గిరిజన భూములకు ఏ మాత్రం రక్షణ ఉండదని, ఈ చట్టాన్ని రద్దు చేసే వరకు గిరిజనులు ఉద్యమించాలని కోరారు. ఐలాజ్ ప్రతినిధి అవసరాల దేవి, ఆదివాసీ సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, గిరిజన నాయకులు రెల్లి సత్యనారాయణ, ఇరట గడ్డియ్య, ఇరట వీరబాబు, బండి సత్యవతి, కర్రి నాగేశ్వరరావు, మాట్లాడారు. గిరిజనులు పాల్గొన్నారు.

40 లీటర్ల సారా స్వాధీనం

గండేపల్లి, జనవరి 27: సీఐ ఎస్. లక్ష్మణరావు, ఇన్‌చార్జ్ ఎస్ఐ నాగార్జున మండలంలోని తాళ్ళూరు గ్రామ శివారులో సారా బట్టీ నిర్వహిస్తున్న అయినవిల్లి సత్యనారాయణను అదుపులోకి తీసుకుని 20లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 600లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. బొర్రంపాలెం గ్రామ శివారులో తాళ్ళూరుకు చెందిన పీడిమి దుర్గా ప్రసాద్ సారా బట్టీలను ధ్వంసం చేసి 20లీటర్ల సారా, 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు సీఐఎస్ఐ చెప్పారు.

'జనం కోసం పవన్' కార్యక్రమం

కరప, జనవరి 27: మండలంలోని యండమూరు గ్రామంలోని వడ్డీపాలెం ప్రాంతంలో జనం కోసం పవన్- పవన్ కోసం మనం కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి కార్యాచరణలో భాగంగా జనసేన నాయకులు గంజా దుర్గాప్రసాద్, కుక్కల మల్లేష్ ఆధ్వర్యంలో జనసేన పీఏసీ సభ్యుడు, కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీ ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం రాబోతుందని సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వడ్డీపాలెం యువత, టీడీపీ నాయకులు పిల్లి శ్రీను, పిల్లి రమేష్, గుబ్బల అప్పారావు, మేడిశెట్టి భద్రరావు, జనసైనికులు ఉన్నారు.

టీచర్ కుటుంబానికి సాయం

తుని రూరల్, జనవరి 27: తొండంగి ప్రభుత్వ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న అనిత అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబానికి యూటీఎఫ్ సంక్షేమ నిధి నుంచి సభ్యులు రూ.5లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. తొండంగిలో ఆ శాఖ అధ్యక్షురాలు వరలక్ష్మి చేతులమీదుగా నగదు చెక్కును అందజేశారు. జిల్లా కార్యదర్శులు సీతారామయ్య, సత్తిబాబు, సభ్యులు సుందరం, సత్యనారాయణ, గంగ ఉన్నారు.

ఉత్తమ సేవా పురస్కారం

గండేపల్లి, జనవరి 27: గండేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అత్యుత్తమ సేవలందించినందుకు వైద్యాధికారి కె.వెంకట్‌నరేష్‌కి రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ నుంచి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. సీహెచ్‌వో ఎస్‌వీఎస్ టీఆర్ శర్మ కూడా అందుకున్నారు.

ముగిసిన సవిత్ర కాఠక మహాయాగం



మహాయాగానికి పూర్ణాహుతి నిర్వహించిన దృశ్యం

పిఠాపురం, జనవరి 27: పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో 3రోజులు పాటు నిర్వహించిన సవిత్ర కాఠక మహాయాగం శనివారం సాయంత్రం ముగిసింది. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూర్ణాహుతి నిర్వహించారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, మండపారాధనలు, పంచకాఠక, లక్ష్మీగణపతి సహిత దత్తాత్రేయ మూలమంత్ర హోమం జరిగాయి. పూర్ణాహుతి అనంతరం రాత్రి శ్రీపాదశ్రీవల్లభుల వారి రథోత్సవం కనులపండువగా జరిగింది. పుర వీధుల్లో సాగిన ఈ రథోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులతో పాటు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డెం జనార్థనరావు, కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తదితరులున్నారు.

అపీత కుంచాంబకు బంగారు నత్తి

ప్రత్తిపాడు, జనవరి 27: రాచపల్లి అడ్డురోడ్డు వద్దగల అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో అపీత కుంచాంబ అమ్మవారికి ఒమ్మంగికి చెందిన వ్యాపార వేత్త పాడిశెట్టి బాబ్జి దేవి దంపతులు బంగారు నత్తిని సమర్పించారు. అమ్మవారికి లలిత సహస్రనామ శాస్త్రోక్తంగా 183 శ్లోకాలు పారాయణం చేసి 183 చీరలు అమ్మవారికి సమర్పించి కుంకుమార్చన చేశారు. కుంకుమార్చనకు వచ్చిన భక్తులకు ఈ చీరలు పంపిణీ చేశారు. పూర్ణిమి శుభ సందర్భంగా ఆశ్రమంలోని గోవులకు గ్రాసం, ఆశ్రమవాసులకు అన్నదానం చేశారు.

జగ్గంపేటలో అన్న సమారాధన

జగ్గంపేట, జనవరి 27: జగ్గంపేట గ్రామదేవత శ్రీ రావులమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ హాజరై రావులమ్మ దర్శనం చేసుకుని భక్తులకు అన్న ప్రసాదం వడ్డించి స్వీకరించారు. 4వేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేశామని జీను మణిబాబు తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, జీను మణిబాబు, కొత్తకొండబాబు, దేవరపల్లి మూర్తి, జీను పెద్ద రాంబాబు, పాండ్రంగి రాంబాబు, వీవీబీ ప్రసాదరావు, దావర్తి సీతారామయ్య, బస్వా వీరబాబు, భక్తులు ఉన్నారు.

రహదారి భద్రతపై ర్యాలీ

తుని రూరల్, జనవరి 27: రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీవో శ్రీనివాస్, తుని పోలీసులు రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీవో శ్రీనివాస్, ఎస్ఐ రామలింగేశ్వరరావు డ్రైవర్లతో సమావేశమై అవగాహన కల్పించారు.

ప్రకటన

మా క్లయింటు శ్రీ మేడపాటి టరగ శయన రెడ్డి గారు మాకు ఇచ్చిన సెంటుజాన్స్‌పై యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

కాకినాడ మునిసిపల్ ఏరియా, సూర్యారావుపేట, గొడారిగుంట, సర్వే నెం. 46/6ఎ, 46/6బి, 46/1బి భాగాలలో కొమ్మిడి వారికి చెందిన ... 1006.87 చదరపు గజాల ఖాళీ స్థలమును ... 4652/2016, 4653/2016 మరియు 9716/2021 ... [illegible]

మెర్ల సూర్యనారాయణ, B.Com. B.L.,
మల్లంపల్లి సర్వేశ్వరరావు, B.Com. B.L., అడ్వకేట్స్
కాకినాడ. డో.నెం. 8-15-3, ... గాంధీనగర్, కాకినాడ. సెల్: 9848265645

Anand
CINEMAS
(4 SCREENS)
Experience it in 4K Dolby Atmos
BHANUGUDI JUNCTION KAKINADA
BOOK ONLINE TICKETS Paytm
NOW SHOWING



SAINDHAV (U/A)(TEL) : 11:45 AM, 6:20 PM
GUNTUR KAARAM (TEL)(U/A): 6:30 PM
HANUMAN (TEL)(U/A)
11:10 AM, 2:15 PM, 6:15 PM, 9:20 PM
NAA SAMIRANGA (TEL)(U/A): 2:30 PM, 9:45 PM
CAPTAIN MILLER (U/A)(TEL):
11:20 AM, 2:20 PM, 6:10 PM, 9:30 PM
105 MINUTES (TEL)(U/A): 2:45 PM, 10:00 PM
AYALAAN (U) - TELUGU: 11:30 AM

అవార్డు గ్రహీతకు
అభినందనలు



శ్రీమతి వి. సత్య గారు
సామర్లకోట మండల వ్యవసాయాధికారిణి
విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసినందుకు గాను 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న సామర్లకోట మండల వ్యవసాయాధికారిణి శ్రీమతి వి. సత్య గారికి
మా హృదయపూర్వక అభినందనలు...
సామర్లకోట మండల ఎరువుల, పురుగు మందుల డీలర్స్ అసోసియేషన్

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్, 105 మినిట్స్, కెప్టెన్ మిల్లర్

దేవి మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్, కెప్టెన్ మిల్లర్

తిరుమల	:	సైంధవ్
లక్ష్మి	:	ఫైటర్
సీ ఆండ్‌సీ1	:	గుంటూరు కారం
సీ ఆండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	నా సామిరంగ
పద్మప్రియ	:	గుంటూరు కారం
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	హనుమాన్

ఫర్నీచర్ వితరణ

జగ్గంపేట, జనవరి 27: పెన్షనర్ల భవనంలో సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి అధ్యతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆదిత్య ఆసుపత్రి అధినేత బాలగంగాధర్, వాకర్స్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ కొత్త కొండబాబు పాల్గొన్నారు. మేకా సుబ్బారావు భార్య సత్యవతి జ్ఞాపకార్థం ఈ భవనానికి రూ.25 వేల విలువ చేసే ఫర్నీచర్ అందజేశారు. ఉపాధ్యక్షుడు తోలేటి సూర్య నారాయణ, సంఘ నాయకులు ముంచాల మల్లేశ్వరరావు, దువ్వాడ అమృతరావు, మండపాక అప్పారావు, పడాల వీరవెంకట సత్యనారాయణ, జోషి ఉన్నారు.